క్లుప్తంగా

దోమకాటుకు గురికాకండి


వేల్పులలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

వేముల : గ్రామాల్లో దోమలు వ్యాప్తిచెందకుండా చూసుకుని దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య తెలిపారు. మండలంలోని వేల్పుల గ్రామంలో మంగళవారం ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించారు. నీరు నిల్వ ఉన్న చోట అబేట్ పిచికారీ చేసి మలేరియా, డెంగ్యూ జ్వరాలపై అవగాహన కల్పించామన్నారు. జ్వరాలు వచ్చినట్లయితే వెంటనే రక్తపరీక్షలు చేయించుకోవాలని సూచించామన్నారు. డెంగ్యూ లక్షణాలున్నట్లయితే పులివెందుల ఏరియా ఆసుపత్రిలో రక్తపరీక్షలు చేయించుకుని వ్యాధి నిర్ధారణ తర్వాత మందులు వాడాలన్నారు. అనంతరం దోమకాటు–ఆరోగ్యానికి చేటు అంటూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు ముగింపు పలకాలి


ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

జమ్మలమడుగు రూరల్ : తల్లిదండ్రులు తమ పిల్లలకు బాల్య వివాహాలు చేయకుండా ముగింపు పలకాలని జమ్మలమడుగు ఐసీడీఎస్ అధికారిణి రాజేశ్వరిదేవి తెలిపారు. మంగళవారం దేవగుడి గ్రామంలో బాల్య వివాహాల నిరోధక చట్టం, పౌష్టికాహారంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించి అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాల వచ్చేవరకు వివాహాలు చేయరాదన్నారు. అలా చేస్తే చట్టరీత్యా నేరం అన్నారు. అలాగే గర్భిణులు మంచి పోషకాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజరు గౌసియా, అంగన్‌వాడీ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

దేశంపై గౌరవం ఉండాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

వేంపల్లె : మన దేశం పట్ల గౌరవాన్ని కలిగి ఉండాలని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ సంధ్యారాణి తెలిపారు. మంగళవారం ఆర్కేవ్యాలీ క్యాంపస్‌లో నా మట్టి–నా దేశం (మేరా మిట్టి – మేరా దేశ్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ 6,8 యూనిట్ల ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో మట్టిని సేకరించి మట్టితో తయారుచేసిన అమృత కలశాలతో నింపి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశం పట్ల గౌరవంతో పాటు జాతీయ స్ఫూర్తిని కలిగి ఉండాలన్నారు. మనదేశం కోసం ప్రాణత్యాగం చేసి అమరులైన అమరవీరుల్ని గుర్తించి స్మరించుకోవడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు అనూషరాజ్, రామసుబ్బయ్య, కోఆర్డినేటర్ మధుసూదన్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు కృషి చేయాలి


మాట్లాడుతున్న ఆర్ఓ చంద్రమోహన్

కమలాపురం : త్వరలో జరగబోయే సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్, రెవెన్యూ అధికారులు కృషి చేయాలని ఆర్ఓ చంద్రమోహన్ తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని రెవెన్యూ, పోలీస్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. గత ఎన్నికల్లో ఎక్కడెక్కడ ఘర్షణలు జరిగాయో వివరాలు తీసుకుని ఈ సారి పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. రెండు శాఖల అధికారులు కలసి ప్రతి పోలింగ్ స్టేషన్‌ను తనిఖీ చేయాలన్నారు. ఎవరైన సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తానన్నారు. అలాగే బైండోవర్ చేసిన వారికి జరిమాన రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో సీఐలు రామకృష్ణారెడ్డి, శంకర్ నాయక్, ఎస్ఐలు చిన్నపెద్దయ్య, తహసీల్దార్లు సరస్వతి, అలీఖాన్, ఉదయ్ భాస్కర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

21న ఆధ్యాత్మిక కార్యక్రమం

కడప కల్చరల్ : ఆంధ్రప్రదేశ్ ఉలమా అయిమ్మ కమిటీ కడప శాఖ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీ రాత్రి 9 గంటలకు ఇస్లాం ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆగాడి వీధిలోని ఇనాయత్ ఖాన్ తాలీంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ఆధ్యాత్మిక గురువులు హాజరై ప్రసంగిస్తారు.

జగనన్న ఆరోగ్య సురక్ష.. పేదలకు వరంలాంటిది


పెద్దముడియం : వృద్ధుడి ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి


పులివెందులలో కిట్లను అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్


వీఎన్‌పల్లెలో : పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి

పులివెందుల టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల పాలిట ఒక వరంలాంటిదని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్‌లు తెలిపారు. మంగళవారం పట్టణంలోని నగరిగుట్ట, భాకరాపురం అర్బన్ హెల్త్ సెంటర్లలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. బీపీ, షుగర్, డెంగ్యూ, మలేరియా, తదితర దీర్ఘకాలిక జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారన్నారు. ఈ వైద్యశిబిరాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ హాఫీజుల్లా, కమిషనర్ నరసింహారెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దముడియంలో..

పెద్దముడియం : పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష అని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చిన్నపసుపుల గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకంలో 2500 వ్యాధులను చేర్చారన్నారు. ఆరోగ్యశ్రీలోకి రాని వ్యాధుల బారిన పడిన వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో హెల్త్‌క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలతో వైద్యాన్ని పేదల చెంతకు చేర్చిన ఘనత జగనన్నదేనన్నారు. ఆరోగ్య సిబ్బందిని ఇంటింటికి పంపించి వ్యాధిగ్రస్తులను గుర్తించి వైద్య శిబిరాలకు తెచ్చి స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్యం చేయించే కార్యక్రమం దేశంలో ఎక్కడా లేదన్నారు. ఇలాంటి అవకాశాన్ని ప్రజలందరూ ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చవ్వా కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, లక్ష్మిరెడ్డి, భరత్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, గ్యాస్ శివారెడ్డి, ప్రతాప్ రెడ్డి, అధికారులు, వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : మండలంలోని తుమ్మలపల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు ఆరోగ్య భరోసా కలిప్పించిందన్నారు. అనంతరం ఆయన ప్రజలకు వైద్య సేవలను అందించి మందులను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు టి.బాలయ్య, ఉప మండలాధ్యక్షుడు ఎంవీ మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు అమరావతి, తుమ్మలపల్లి గ్రామ సర్పంచ్ పుష్పావతి, వలసపల్లి గ్రామ సర్పంచ్ గంగమ్మ, తహసీల్దార్ ఎ.నాగేశ్వరరావు, ఎంపీడీఓ ఎస్.రంతుల్లయ్య, వైద్యులు, గ్రామ సచివాలయ అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : పేద ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డిలు తెలిపారు. మండలంలోని పాతసంగటిపల్లెలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వారు పరిశీలించి మాట్లాడారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలనే ఆకాంక్షతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేశాడన్నారు. దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రజలకు ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, ఎంపీటీసీ నాగమల్లారెడ్డి, సర్పంచ్ సుజాత, మాజీ జెడ్పీటీసీ భాస్కర్, వైఎస్సార్‌సీపీ నాయకులు మనోహర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, రవీంద్రారెడ్డి, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, డీటి అంజనాగౌరి, వైద్యులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వరంలాంటిదని మండల తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని ముత్తుకూరులో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ఆధ్వర్యంలో వివిధ జబ్బులకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఫుడ్ స్టాల్ ఏర్పాటు చేసి పూర్తిగా ఆహారాన్ని అందించారు. బాల్య వివాహాలను అరికట్టాలని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గర్భిణులకు శ్రీమంతం చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సునీత, సూపర్వైజర్లు నాగరత్న, స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో

వీరపునాయునిపల్లె : మండలంలోని వెల్దుర్తి గ్రామ సచివాలయంలో మంగళవారం మండల వైద్యాధికారి మహమ్మద్‌తాహ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి పరిశీలించారు. శిబిరంలో 426 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు తెలిపారు. అనంతరం పౌష్టికాహారానికి సంబంధించిన స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచు విశ్వనాథ్, గడ్డంవారిపల్లె సహకార సంఘం డైరెక్టర్ గంగిరెడ్డి, వైద్యాధికారి జ్యోతి, స్థానిక వైయస్సార్‌సీపీ నాయకులు బ్రహ్మానందరెడ్డి, లక్షుమయ్య, గుర్రయ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయండి


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పులివెందుల టౌన్ : పెండింగ్ పనులు పూర్తి చేసి పులివెందుల మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్ లు కోరారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన అత్యవసర సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ది బెస్ట్ మున్సిపాలిటీగా పులివెందులను తీర్చిదిద్దాలన్నారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చొరవ తీసుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. పులివెందులలో రెండు అంగన్‌వాడీ సెంటర్లకు సంబంధించి అధికారులు అంచనాలు వేసి నివేదిక ఇవ్వాలన్నారు. ప్రతి కౌన్సిలర్ తమ వార్డులలో పర్యటించి అక్కడ నెలకొన్న సమస్యలను వెంటనే కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చి వాటిని పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందరికి అందుతున్నాయా.. లేదా అన్న వాటిపై కూడా దృష్టి సారించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కౌన్సిలర్లు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రతి ఒక్కరికి ఇళ్లు అందేలా జగనన్న హౌసింగ్ కాలనీకి సంబంధించి లబ్ధిదారులచే రూ.35వేలు నగదును చెల్లించేలా అవగాహన కల్పించాలన్నారు. దెబ్బతిన్న చెత్త సేకరించే వాహనాలకు మరమ్మతులు చేయించాలన్నారు. వార్డుల వారీగా ఎక్కడైనా సమస్యలున్నా, సీసీ రోడ్ల నిర్మాణాలు లేకపోయిన ప్రతి ఒక్కదానిపై దృష్టిపెట్టి సమస్యలు లేకుండా చూడాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. పులివెందుల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులను పుష్కలంగా అందిస్తున్నారని, ఈ అవకాశాన్ని మనం సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అభివృద్ధి పనులకు సంబంధించి గెజిట్‌లో పొందుపరచిన వాటికి కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ హాఫీజుల్లా, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం


వేముల సచివాలయ వివరాలను ఆరా తీస్తున్న పీడీ

వేముల : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థతో గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధ్యమైందని డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వేముల, వి.కొత్తపల్లె సచివాలయాలను మంగళవారం వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డితో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో ప్రజల వద్దకే పాలన తీసుకువచ్చి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. గ్రామాల్లో సచివాలయాలను ఉపాధిహామీ పథక నిధులతో నిర్మించామన్నారు. ఏయే గ్రామాల్లో సచివాలయాల నిర్మాణాలు పూర్తి అయ్యాయి.. ఎక్కడెక్కడ నిర్మాణాలు జరుగుతున్నాయి.. పూర్తైన సచివాలయాలను సంబంధిత శాఖకు అప్పగించారా అనే విషయాలపై ఆరా తీస్తున్నామన్నారు. సచివాలయ నిర్మాణాలు పూర్తికాని చోట త్వరితగతిన నిర్మించాలని సూచించామన్నారు. అలాగే పూర్తి అయిన సచివాలయాలను సంబంధిత శాఖకు అప్పగించాలని సిబ్బందికి సూచించామన్నారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మళ్ళీ జగనన్ననే సీఎంగా గెలిపించుకుందాం


మాట్లాడుతున్న కల్లూరు నాగేంద్రారెడ్డి

ముద్దనూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మళ్ళీ ముఖ్యమంత్రిగా గెలిపించుకునేటందుకు పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు కృషిచేయాలని వైఎస్సార్ సీపీ నేత, జిల్లా జేసీఎస్ కో–ఆర్డినేటర్, నియోజకవర్గ పరిశీలకులు కల్లూరు నాగేంద్రారెడ్డి కోరారు. మంగళవారం స్థానిక టింబర్‌డిపోలో మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డితో కలిసి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, అలాగే ఎమ్మెల్యేగా ఎం.సుధీర్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమపథకాలను పూర్తిస్థాయిలో అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే నన్నారు. ఈ విషయాలను ప్రజలలోకి తీసుకెళ్లి మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్ననే గెలిపించుకోవాలన్నారు. గతంలో చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాళ్ళు ఇంద్రాణి, రేణుక, పార్టీ మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు సుమంత్, పార్టీ నాయకులు వరదారెడ్డి, గుర్రప్ప, డాక్టర్ నవజ్యోత్‌రెడ్డి, వీరాంజనేయరెడ్డి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

హోమియో వైద్య శిబిరానికి స్పందన

కమలాపురం : పట్టణ పరిధిలోని కుప్పూరువారిపల్లెలో ఏర్పాటు చేసిన హోమియో వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మంగళవారం ప్రభుత్వ హోమియో వైద్యులు షాకీర్ హుసేన్ గ్రామంలో శిబిరం ఏర్పాటు చేసి తదితర జ్వరాలు ఉన్న రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. హోమియోలో అన్ని రోగాలకు వైద్య సేవలు ఉన్నాయని, అలాగే ఈ మందుల వలన ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవన్నారు. ప్రస్తుతం నూతనంగా ప్రారంభించిన ఆసుపత్రిలో హోమియో వైద్యశాల ఏర్పాటు చేశామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

పగటి కలలు కనడం మానుకోండి


మాట్లాడుతున్న ఎస్సీ నాయకులు చిన్నప్ప, కిశోర్‌లు

పులివెందుల టౌన్ : టీడీపీ నాయకులు పగటి కలలు కనడం మానుకుని నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే బాగుంటుందని పులివెందుల ఎస్సీ నాయకులు, మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, కౌన్సిలర్లు పార్నపల్లి కిశోర్, డేనియల్‌బాబులు తెలిపారు. మంగళవారం పులివెందులలో వారు మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఎస్సీలుగా పుట్టడమే తప్పని ఎగతాళిగా మాట్లాడితే.. సోమవారం పులివెందులలో నిర్వహించిన సైకిల్ ర్యాలీలో శింగనమల నియోజకవర్గం టీడీపీ నాయకుడు ఎంఎస్ రాజు మాట్లాడుతూ పులివెందులలో అత్యధిక మెజార్టీతో టీడీపీ గెలుస్తుందనడం హాస్యాస్పదం అన్నారు. అయితే ఎస్సీలను సొంత మనుషులుగా చూస్తూ వారిని అభివృద్ధి వైపు నడిపిస్తున్న ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. శింగనమల నియోజకవర్గంలో లోకేష్ బాబు పాదయాత్ర చేస్తుంటే అదే నియోజకవర్గానికి చెందిన ఎమ్మెస్‌రాజు అనే వ్యక్తిని, నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్సీ మహిళను కూడా దరిదాపుల్లోకి రానివ్వకుండా అడ్డుకున్న పార్టీ టీడీపీనే అన్నారు. ఎమ్మెస్ రాజు పులివెందులలో ఇక మీదట ఇలా మాట్లాడితే ఎస్సీలే బుద్ధిచెప్పె పరిస్థితి వస్తుందని హితవు పలికారు.

అన్నపూర్ణాదేవి నమోస్తుతే..


పులివెందుల : అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారిశాల అమ్మవారు

పులివెందుల టౌన్ : పట్టణంలోని ఆలయాలు శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని 3వ రోజు మంగళవారం అమ్మవారిశాలలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకారంలో, అలాగే అంకాలమ్మ ఆలయంలో శ్రీపార్వతీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. అలాగే శ్రీవేంకటరమణస్వామి ఆలయంలో స్వామివారు శ్రీలక్ష్మీనరసింహాస్వామి అవతారంలో దర్శనమిచ్చారు. వివిధ రూపాల్లో ఉన్న అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కమలాపురంలో..

కమలాపురం : పట్టణంలో వెలసిన మత్యకన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో కుంకుమార్చన భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారు శ్రీ భవానిదేవి అలంకారములో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో దసరా ఉత్సవాల్లో ఉదయం లలితా హోమము, రాత్రి లలితా సహస్రనామార్చన నిర్వహించారు. పలువురు భక్తులు శ్రీ భవానిదేవి అలంకారములో వెలసిన అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో.

వీరపునాయునిపల్లె : దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా మూడవ రోజు తలపనూరు గడ్డంవారిపల్లె రాజరాజేశ్వరీదేవి పార్వతీదేవి, గంగమ్మతల్లి గాయత్రీదేవి, సంగమేశ్వరాయలంలో పార్వతీదేవి అన్నపూర్ణాదేవి అలంకారాలలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవార్లను దర్శించుకునేందకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : దసరా ఉత్సవాల్లో భాగంగా అన్నపూర్ణదేవి అలంకారంలో వాసవి మాత మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సురేంద్ర తెలిపారు. ఎంపీపీ లక్ష్మిగాయత్రి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక బలిజ సంఘం వీధిలో వెలసిన శ్రీగౌరీదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు నంబూరు కులాయప్ప, కటిక చంద్రశేఖర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో.

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట–బుగ్గలేటిపల్లి సమీపంలో వెలసిన గంగమ్మతల్లి దేవీ ఆలయంలోని అమ్మవారు శ్రీగాయత్రీదేవీ అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ చైర్మన్ బీపీ విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ ఈవో పి.సురేష్‌కుమార్‌రెడ్డి అన్ని ఏర్పాట్లు చేశారు.

చెన్నూరులో.

చెన్నూరు : స్థానిక శ్రీ రామలింగ చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారికి గణపతి పూజ అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారు శ్రీ గాయత్రిదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణంలోని శ్రీమత్ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణదేవిగా, శ్రీ ఏరువాక గంగమ్మతల్లి ఆలయంలో గాయత్రిదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అమ్మవారిని ఆలయంలో ఊరేగింపు చేశారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రముఖ ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాలలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అంబభవాని దుర్గామాతగా, కన్యకాపరమేశ్వరి, ముద్దనూరు రోడ్డులో ఉన్న రాజరాజేశ్వరిదేవిలు గజలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆదేవిధంగా నాగులకట్టలోని చౌడేశ్వరిదేవి గాయత్రిదేవిగా, మండల పరిధిలోని కన్యతీర్థంలోని బాలత్రిపుర సుందరిదేవి భవానిదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చూడండి

జమ్మలమడుగు : సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ అంతరాయంలేకుండా, అలాగే నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ రమణ తెలిపారు. మంగళవారం ఆయన అధికారులతో కలసి జమ్మలమడుగులోని సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి సూచనలు, సలహాలు అందించారు. అధికారులు క్షేత్రస్థాయిలో తిరిగి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, అధికారులు ఒక వినియోగదారుని ఎల్‌టీ లైన్‌లో పని కోసం గంటల కొద్దీ ఎల్‌సీ తీసుకోవడం సరికాదన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎబీ స్విచ్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. రైతులకు పగటిపూట 9 గంటలు ఉచిత సరఫరాలో జాప్యం లేకుండా చూడాలన్నారు. జమ్మలమడుగు సబ్ డివిజన్ పరిధిలో రూ.5.17 కోట్ల మొండి బకాయిలు ఉన్నాయన్నారు. అధికారులు వాటిపై దృష్టి సారించాలన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయుల వర్ధంతి


దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న బలిజ సంఘం అధ్యక్షుడు గురుప్రసాద్, తదితరులు

పులివెందుల టౌన్ : శ్రీకృష్ణదేవరాయల 494వ వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం కార్యాలయంలో ఆ సంఘ అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్ ఆధ్వర్యంలో పూలఅంగళ్ల సమీపంలో ఉన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల భవనంలో దివ్యాంగులకు, అలాగే శ్రీవీరనారాయణస్వామి అంధుల ఆశ్రమం, బదిరుల ఆశ్రమంలో నిరాశ్రయులకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, బలిజ సంఘ సభ్యులతో పాటు వికలాంగుల నెట్‌వర్క్ సభ్యులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : బలిజ సంఘం వీధిలో వెలసిన శ్రీగౌరీదేవి ఆలయంలో ఉన్న శ్రీకృష్ణదేవరాయ చిత్రపటానికి బలిజ సంఘం అధ్యక్షుడు నంబూరు కుళ్లాయప్ప పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కొత్తూరు రెడ్డయ్య, ఉపాధ్యక్షుడు ఎడాల రామ, ప్రధాన కార్యదర్శి నామాశేఖర్, మహిళా మండలి అధ్యక్షురాలు రత్నాలమ్మ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విలువైన అభరణాలపై జాగ్రత్తగా ఉండాలి

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలో నివాసం ఉండే ప్రజలు దసరా, తిరుమల ఉత్సవాలకు వెళ్లే సమయంలో విలువైన అభరణాలపై జాగ్రత్తగా ఉండాలని పట్టణ సీఐ ఈశ్వరయ్య తెలిపారు. మంగళవారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. దసరా ఉత్సవాలకు దేవాలయాలకు వెళ్లే భక్తులు విలువైన బంగారు అభరణాలు ధరించి వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే ఉత్సవాలను నిర్వహించే నిర్వాహకులు కూడా దేవాలయాలయ ప్రాంతాలలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని భక్తులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. ఉత్సవాలలో ఏవరైన అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే 9121100530 నంబర్‌కు, అలాగే 100కు సమాచారం తెలపాలన్నారు.

రేపు మండల సమావేశం

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : గురువారం ఉదయం 11 గంటలకు మైలవరం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మండల ఎంపీడీఓ రామచంద్రారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ చేరెడ్డి సావిత్రి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండల ప్రజాప్రతినిధులు మండల అధికారులు హాజరుకావాలని ఆయన సూచించారు.

పెద్దన్న స్వామి మృతి

సింహాద్రిపురం : మండలంలోని నిడివెల్ల కాశినాయన ఆశ్రమ నిర్వాహకుడు పెద్దన్నస్వామి మంగళవారం మృతి చెందాడు. ఇక్కడ 23 సంవత్సరాల క్రితం పెద్దన్నస్వామి కాశినాయన ఆశ్రమం ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇక్కడ ప్రతీ ఏటా కాశినాయన ఆరాధన ఉత్సవాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఇక్కడ కాశీవిశ్వేశ్వర ఆలయం, నవగ్రహాల మండపం ఉన్నాయి. భక్తులు సంతాపం తెలిపారు.